ఎడిటర్ :
మంచె శరత్ చంద్ర

సంపుటి : 13
సంచిక : 342

పేజీలు : 5 వెల రూ. 2/-

మంగళవారం
28 ఏప్రిల్ 2026

PUBLISHED FROM :
HYDERABAD

AM న్యూస్
ప్రతిదినం ప్రత్యేకం
www.amnews7.com

## కోర్టుపై నాకు నమ్మకం పోయింది

- అందుకే మీరు ఉన్నంత వరకు హాజరు కాను
- ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిపై కేజ్రీవాల్ వ్యాఖ్యలు
- ఈ మేరకు లేఖ విడుదలచేసిన కేజ్రీవాల్



# బిఆర్ఎస్‌కు గతమే.. భవిష్యత్ లేదు

- ఉద్యమంలో ఏది మాట్లాడినా చెల్లింది
- కవిత పార్టీ కుటుంబ గూడుపుఠాణి
- కెసిఆర్ ఆరోగ్యంగా ఉండాలనే కోరుకుంటా
- ఆయన చావాలని తానెప్పుడూ కోరుకోలేదు
- కాళేశ్వరంపై సిబిఐ విచారణ తరవాతే చర్యలు
- మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి
- పార్లమెంట్ తరహాలో అసెంబ్లి ప్రాంగణం
- సెంట్రల్ హాలును త్వరగా పూర్తి చేయాలి
- పబ్లిక్ గార్డెన్‌లో సభ్యులకు క్లబ్ ఏర్పాటు
- స్పీకర్, మండలి చైర్మన్‌తో సిఎం రేవంత్ సమీక్ష

2 లో



## మహిళల భద్రతకు ప్రభుత్వం పెద్దపీట

- మహిళలు, చిన్నారుల రక్షణకు ప్రాధాన్యం
- మహిళలను అన్నరంగాల్లో ఆదర్శంగా నిలిపాం
- మహిళాభివృద్ధికి తెలంగాణ బ్రాండ్ కావాలి
- గంజాయి, డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపుతున్నాం
- మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత బస్సు
- అన్నిరంగాల్లో మహిళా రిజర్వేషన్ల కాంగ్రెస్ ఘనతే
- స్పందన బృందాల ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్

2 లో





### ప్రతి కుటుంబం ఖచ్చితంగా
## వివరాలు నమోదు చేసుకోవాలి

- జనగణనతో పథకాల ప్రయోజనాలు సరిగ్గా అందుతాయి
- జనగణ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
- ఖమ్మంలో వివరాలను నమోదు చేసుకున్న భట్టి

2 లో



# రాష్ట్రంలో దైన్యంగా రైతుల పరిస్థితి

- ధాన్యం కోనే దిక్కుల లేకుండా పోయింది
- బిజెపి ఎంపి తేజస్వీ సూర్య వ్యాఖ్యలు దుర్మార్గం
- ఒక్కరు కూడా ఎదిరించి మాట్లాడలేక పోయారు
- బిఆర్ఎస్ ఎంపిలు ఉంటే రణరంగం సృష్టించేవారు
- తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్
- బిఆర్ఎస్ అన్ని కమిటీలు రద్దు
- కొత్త కమిటీలు నియమించాలని కెసిఆర్ ఆదేశం

2 లో



# మహిళల భద్రతకు ప్రభుత్వం పెద్దపీట

ఏఎం న్యూస్, హైదరాబాద్,ఏప్రిల్27:
అభివృద్ధి చెందిన దేశాల్లో మహిళలు, చిన్నారులకు రక్షణ మొదటి ప్రాముఖ్యతగా ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఏ దేశంలో, నగరంలో వీరికి రక్షణ ఉంటుందో.. అక్కడ అభివృద్ధి ఎక్కువగా జరుగుతుందన్నారు. మహిళలు, చిన్నారుల భద్రత కోసం హైదరాబాద్ పోలీసులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో స్పందన బృందాలను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం మహిళల భద్రతకు పెద్దపీట వేసింది. గతంలో షీ టీమ్స్ ఏర్పాటు చేస్తే.. 'స్టాండ్ విత్ హర్' అని ప్రత్యేక కార్యక్రమం చేపట్టాం. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం, హైదరాబాద్ పోలీసులు స్పందన పేరుతో మరో కార్యక్రమం తీసుకొచ్చారు. వారికి తక్షణ రక్షణ కోసం ఈ టీమ్స్ పని చేస్తాయి. మహిళలు, చిన్నారుల రక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం ముందుంది అని చెప్పేందుకే నేను ఈ కార్యక్రమానికి హాజరయ్యానని సీఎం అన్నారు. అమెరికా లాంటి దేశాల్లోనే మహిళలకు ఓటు హక్కు వచ్చేందుకు ఎన్నో ఏళ్లు పట్టింది. స్వాతంత్ర్యం రాగానే భారత్‌లో మహిళలకు నెహ్రూ సమాన హక్కు కల్పించారు. ఇప్పుడు అన్ని రంగాల్లో మహిళలు ఉన్నత స్థాయిల్లో ఉన్నారు. కానీ ఇంకా కొన్ని చోట్ల వారిపై వివక్ష ఉంది. కానీ మనదేశంలో దేశ ప్రధాని గా, లోక్ సభ స్పీకర్ గా, రాష్ట్రాల గవర్నర్లు, న్యాయమూర్తులు గా మహిళలకు కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇచ్చింది..

మహిళా విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లతో పాటు స్థానిక సంస్థల్లో కూడా మహిళలకు రిజర్వేషన్లు ఇచ్చి పరిపాలన లో కాంగ్రెస్ పార్టీ భాగస్వామ్యం చేసిందన్నారు. చట్టసభల్లో మహిళల రిజర్వేషన్ల కోసం 2013 లోనే బిల్లును కాంగ్రెస్ ఆమోదించిందని గుర్తు చేశారు. ఇప్పటికి కొన్ని విషయాల్లో మహిళలపైన వివక్ష ఉంది.. రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే మహిళలకు రక్షణ కల్పించాలి, పిల్లలకు భద్ర త ఇవ్వాలని మా ప్రభుత్వం భావించిందన్నారు. స్పందన ద్వారా తక్షణమే బాదిత మహిళలకు మానసిక భద్రత కల్పిస్తారు.. సమస్య వచ్చినప్పుడు నా పక్కన నిలబడుతుందన్న విశ్వాసాన్ని మా ప్రభుత్వం కల్పిస్తోంది.. తెలంగాణ రాష్ట్రంలో మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్న సందేశం ఇవ్వడం కోసం నేను ఈ కార్యక్రమంలో పాల్గొన్నాను.. సమస్య వచ్చిన తర్వాత పరిష్కరించడం కాదు.. అసలు సమస్యనే రాకుండా చూడాల్సిన సామాజిక బాధ్యత మనపైన ఉందన్నారు. మహిళల బాధలో అండగా నిలబడి ధైర్యాన్ని ఇచ్చే సామాజిక బాధ్యత అందరిపైన ఉందని, ప్రభుత్వ ప్రతి సంక్షేమ కార్యక్రమాల్లో మహిళలకు పెద్ద పీట వేస్తున్నాం అని వివరించారు. ఇందిరమ్మ ఇళ్లను మహిళలపేరుతో ఇస్తున్నాం..
మహిళకు ఆర్థిక స్వాలంభన వచ్చినప్పుడు కుటుంబం సమాజంలో నిలబడుతుంది..మహిళా సాధికారిత ను అమలు చేయడం




ముఖ్యం.. 67 లక్షల మంది స్వయం సహాయక మహిళా సంఘాలకు 60 వేల కోట్ల రూపాయల బ్యాంక్ రుణాలను అందజేశాం..రాష్ట్రంలోని కోటీ మంది మహిళలకు సారె పేరుతో ఇందిరమ్మ చీరలు ఇచ్చాం.. 28 నెలల్లో మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం ప్రభుత్వం 10 వేల కోట్లు ఖర్చు చేసింది..
ఉచిత బస్సు ప్రయాణాన్ని పకడ్బందీగా అమలు చేయడం వల్ల ఆడబిడ్డలకు 10 వేల కోట్లు ఆదా చేసుకున్నారు.. స్వయం సహాయక సంఘాలకు 1000 బస్సులను కొనిచ్చి ఆర్టీసీకి లీజు ఇప్పించాం.. 1000. మెగావాట్ల సోలార్ ఎనర్జీ ప్లాంట్ల ను స్వయం సహాయక మహిళలకు ఇప్పించాం.. ప్రభుత్వ ఆఫీసుల్లో ఇందిరమ్మ క్యాంటీన్లను స్వయం సహాయక మహిళలతో ఏర్పాటు చేయించాం.. అన్ని జిల్లాల్లో స్వయం సహాయక మహిళా సంఘాలకు భవనాలు ఏర్పాటు చేశామని సిఎం రేవంత్ అన్నారు. నారాయణపేటలో స్వయం సహాయక మహిళా సంఘాలతో పెట్రోల్ బంకు ఏర్పాటు చేయించాం.. 26 వేల ప్రభుత్వ పాఠశాలల నిర్వహరణను మహిళా సంఘాలకే అప్పగించాం..26 లక్షల ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల స్కూల్ యూనిఫామ్ లు కుట్టే బాధ్యతను స్వయం సహాయక మహిళలకు ఇచ్చాం..హైటెక్ సిటీ దగ్గర 1000 కోట్ల విలువ చేసే మూడున్నర ఎకరాల్లో మహిళా శక్తి స్టాల్స్ ను ఏర్పాటు చేశాం.. అమెజాన్ తో ఒప్పందం చేసుకుని ఆడబిడ్డల తయారు చేసే ఉత్పత్తులను అమ్మే విధంగా చేశాం.. 2034 నాటికి వన్ ట్రిలియన్ , 20247 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ గా చేయాలని ప్రభుత్వం లక్ష్యం గా పెట్టుకుందని,ఇది జరగాలంటే మహిళలకు భద్రత ఉండాలని సిఎం అన్నారు. సమాజం నిలబడాలంటే మహిళలు తమ కాళ్లపైన తాము నిలబడాలి.. ఎంత ఆర్థిక ప్రగతి సాధించినా పిల్లలు సరైన దారిలో నడవకపోతే అంతా వృథా.. పంజాబ్ లాంటి రాష్ట్రంలో మన కళ్ల ముందే డ్రగ్స్ వల్ల యువత నిర్వీర్యం అయింది.. వ్యసనాలబారి న పడి ఆ రాష్ట్రం కోలుకోని స్థితిలో ఉంది.. స్కూల్స్ ముందు చిన్న చిన్న దుకాణాల్లో గంజాయి అమ్ముతున్నారు.. మత్తుకు బానిసలైన వారు, గంజాయి తీసుకుంటున్న వారే ఎక్కువ మంది మహిళలు, చిన్న పిల్లలపైన అకృత్యాలకు పాల్పడుతున్నారు.. ఈగల్ ఫోర్స్ ను మా ప్రభుత్వం తీసుకువచ్చి డ్రగ్స్ పైన కఠినంగా వ్యవహరిస్తోంది.. ఎంత పెద్ద వారు ఉన్నా, సెలబ్రేటీల్స్ ఉన్నా , ప్రజా ప్రతినిధులు ఉన్నా వదలకుండా అరెస్టు చేస్తున్నాం.. ఇటీవల డ్రగ్స్ కేసులో ప్రజాప్రతినిధులను కూడా అరెస్టు చేశాం.. గంజాయి, డ్రగ్స్, మద్యం బానిసల వల్ల జరిగే క్రైమ్స్ పైన పీస్ కమిటీ సభ్యులు దృష్టి పెట్టాలి.. మతకల్లోలాలకే కాకుండా పీస్ కమిటీలను విస్తరించాలి.. పాఠశాలల్లో చేరే సమయంలో డ్రగ్స్ తీసుకోమని సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలి..
డ్రగ్స్ , గంజాయి పైన మాట్లాడాల్సిన అవసరం ఇప్పుడు ఉంది.. డ్రగ్స్ పునరావాస కేంద్రాలను కూడా పెంచు తున్నాం.. బాధ్యతను నిర్వహించకపోతే సమాజానికి అన్యాయం చేసినవాళ్లం అవుతాం.. మత్తును వదిలించాల్సిన అవసరం ఉంది.. ఎంత వారున్నా, సెలబ్రేటీస్ ఉన్నా ప్రజల మధ్య శిక్షిస్తే సందేశాన్ని ఇచ్చి వాళ్లం అవుతాం.. అని అన్నారు. భయం, బాధ్యత లేనప్పుడు విచ్చలవిడితనం వస్తుంది.. దీన్ని ప్రభుత్వం సహించదు.. నేరగాళ్ల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది.. ఎంత పెద్ద కుటుంబమైనా, రాజకీయ నాయకుడైనా, ఉన్నతాధికారుల కుటుంబమైనా నేను కేర్ చేయను.. డ్రగ్స్ ను నియంత్రించాల్సిందే.. తెలంగాణ రాష్ట్రం అంటే మహిళల రక్షణ కు పర్యాయ పదం గా తీర్చిదిద్దాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, ఎంపిలు అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, డిజిపి శివప్రసాద్ రెడ్డి, నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో దైన్యంగా రైతుల పరిస్థితి

ఏఎం న్యూస్, హైదరాబాద్,ఏప్రిల్27:
రాష్ట్రంలో రైతుల పరిస్థితి దిగజారిపోయిందని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. ప్రభుత్వానికి ధాన్యం కొనడం చేత కావట్లేదని విమర్శించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఏం జరుగుతోందో అర్థం కావడం లేదు. తెలంగాణ గురించి ఎంపీ తేజస్వి సూర్య ఇష్టం వచ్చినట్లు మాట్లాడారు. ఆయన వ్యాఖ్యలపై కాంగ్రెస్, భాజపా ఎంపీలు ఒక్కమాట మాట్లాడలేదు. బీఆర్ఎస్ ఎంపీలు లోక్‌సభలో ఉండి ఉంటే రణరంగం సృష్టించేవాళ్లు. కాళేశ్వరంపై రాజ్యసభలో సీఆర్ పాటిల్ మాట్లాడితే సురేశ్‌రెడ్డి గట్టిగా ఖండించారు. తెలంగాణ గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే కాంగ్రెస్, భాజపా నేతలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన సమయంలో.. హైదరాబాద్ విషయంలో రాజీ పడాలని సోనియా గాంధీ ఎన్నో సార్లు చెప్పారు. కానీ.. నేను ఎప్పుడూ రాజీ పడలేదు..అది నా చిత్తశుద్ధి అని కేసీఆర్ అన్నారు.బీజేపీ ఎంపీ తేజస్వి సూర్యపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మండిపడ్డారు. డీలిమిటేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా బ్రిటిషర్లు భారత్, పాకిస్థాన్‌ను వేరుచేసినట్టు అత్యంత చెత్త విధానంతో ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణను వేరుచేశారంటూ తేజస్వి చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలోనే ఉన్న కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సహా 16మంది రాష్ట్ర ఎంపీలు ఎవరూ దానిపై కనీసం అభ్యంతరం తెలుపకుండా మౌనంగా ఉన్నారని.. అదే పార్లమెంట్‌లో మన ఎంపీలు ఉండుంటే తేజస్వి సూర్య మాట్లాడిన మాటలకు రణరంగం చేసేవాళ్లు అని పార్టీ అంతర్గత సమావేశంలో అభిప్రాయపడ్డారు.
ఈ 16 మంది కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు తెలంగాణలో పుట్టలేదా? వాళ్లకు తెలంగాణ పౌరుషం లేదా? అని ప్రశ్నించారు. ఎంపీ తేజస్వి సూర్య అనే వెధవ మాట్లాడిన మాటలను ఎందుకు ఎండగట్టలేదని నిలదీశారు. అదే ఒక్క బీఆర్ఎస్ ఎంపీ ఉన్నా పార్లమెంట్‌లో క్షమాపణ చెప్పించేటోళ్లమని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండి పౌరుషంగా లేకుండా వ్యవహరించారని మండిపడ్డారు. ఒకప్పుడు తెలంగాణ రాష్ట్రాన్ని వ్యవసాయ రంగం నుంచి ఇతర అన్ని రంగాల్లో నంబర్‌వన్‌గా నిలబెట్టామని కేసీఆర్ తెలిపారు. కానీ ఈ ప్రభుత్వం భూముల కబ్జాల్లో నంబర్‌వన్, కూలగొట్టడంలో నంబర్‌వన్‌గా నిలబెట్టే ప్రయత్నం చేస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయలేని స్థితిలో చేతకానితనంతో ఉన్నదని మండిపడ్డారు. ధాన్యం కొనుగోళ్లు లేకపోవడం వల్ల రైతన్నలు పడుతున్న ఇబ్బందులు చూస్తుంటే తీవ్రంగా బాధ అవుతుందని అన్నారు. చిల్లర కూతలు, చిల్లర మాటలు మాట్లాడుతున్న ముఖ్యమంత్రి, మంత్రులను చూస్తే జాలి వేస్తుందని అన్నారు. ఇక ఈ అంతర్గత సమావేశంలోనే జీవన్ రెడ్డిని బీఆర్ఎస్ కార్యవర్గానికి పరిచయం చేశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డిని పార్టీ జనరల్ సెక్రటరీగా ప్రకటించారు.
బీఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పార్టీ అధినేత కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. పార్టీ రాష్ట్ర స్థాయి కమిటీ మినహా అన్ని కమిటీలను రద్దు చేశారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ



ఆర్‌కు కీలక బాధ్యతలు అప్పగించారు. త్వరలోనే అన్ని స్థాయిల కమిటీలను నియమించాలని కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారు. కొత్త కమిటీలకు శిక్షణా తరగతులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ బాధ్యతలను కేటీఆర్‌కు అప్పగించారు. అలాగే బీఆర్ ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని కేసీఆర్ సూచించారు. బుక్ మీదనే కాకుండా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో సభ్యత్వాలు నమోదు చేయాలని ఆదేశించారు.

# బిఆర్ఎస్‌కు గతమే..భవిష్యత్ లేదు

ఏఎం న్యూస్, హైదరాబాద్,ఏప్రిల్27:
బీఆర్ఎస్ పార్టీకి గతం ఉంది.. భవిష్యత్ లేదని, ఉద్యమ సమయంలో అప్పుడు ఎలా మాట్లాడినా ప్రజలు సహించారని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చిట్‌చాట్‌గా మాట్లాడారు. కవిత కొత్త పార్టీ ఏర్పాటుపైనా ఆయన స్పందించారు. కేసీఆర్ కుటుంబమంతా ఒక్కటే అని విమర్శించారు. వాళ్లు తెచ్చిపెట్టుకున్న నటనను ప్రదర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ పార్టీకి మనుగడ లేదు. అధికారంలో ఉన్న పదేళ్లు కూడా అలాగే మాట్లాడారు. కేసీఆర్ కుటుంబానికి, బీఆర్ఎస్ పార్టీకి ప్రజలతో సంబంధాలు లేవు. కేసీఆర్ విశ్రాంతిలో ఉన్న ప్రజాప్రతినిధి. ఆయన చావును నేనెందుకు కోరుకుంటానన్నారు. ఆయన ఆరోగ్యంగా ఉంటేనే మాకు మంచిది. ఆయన మర మనిషో కాదో.. కుటుంబ సభ్యులకే తెలుసు. వివక్ష లేని పాలన మాది.. మాకు ప్రతిపక్షమే లేదు అని సీఎం అన్నారు. కాళేశ్వరం కమిషన్ నివేదికను హైకోర్టు తప్పుపట్టలేదని సీఎం అన్నారు. సాంకేతిక లోపాలున్నాయని మాత్రమే చెప్పిందని.. నివేదిక ఆధారంగా చర్యలు వద్దని కోర్టు చెప్పిందన్నారు. కాళేశ్వరం అక్రమాలపై సీబీఐ విచారణ తర్వాతే చర్యలు ఉంటాయన్నారు.మాజీ సీఎం కేసీఆర్ ఆరోగ్యంపై తాను ఎప్పుడూ నెగటివ్‌గా ఆలోచించలేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్ తనకు రాజకీయ ప్రత్యర్థి మాత్రమేనని, శత్రువు కాదని అన్నారు. కేసీఆర్ ఆరోగ్యంగా ఉండటం తనకే మంచిదని, రాజకీయంగా ఎదుర్కోవడం సులభమవుతుందని వ్యాఖ్యానించారు. విశ్రాంతి తీసుకుంటున్న ప్రజా ప్రతినిధి గురించి చెడు కోరుకోవడం తన స్వభావం కాదని తెలిపారు. కేసీఆర్‌కు గాయమైనప్పుడు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించానని, అసెంబ్లీకి వచ్చినప్పుడు కూడా ఆయన్ను కలిసి యోగక్షేమాలు అడిగానని రేవంత్ రెడ్డి తెలిపారు. రాజకీయంగా విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగతంగా గౌరవం ఉందని పేర్కొన్నారు. కేసీఆర్‌కు చెడు జరగాలని ఆయన కుటుంబ సభ్యులే కోరుకుంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి



ఆరోపించారు. కేసీఆర్ బతికి ఉంటే తమకు అధికారం రాదని ఆయన కుటుంబ సభ్యులే భావిస్తున్నారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే కేటీఆర్ ముఖ్యమంత్రి కావాలని మంత్రులతో ప్రకటనలు చేయించారని ఆరోపించారు. అధికార పంపకాల విషయంలో తేడాలు రావడంతో కుటుంబంలో విభేదాలు వచ్చాయని అన్నారు. అయితే, వాళ్లంతా ఒక్కటేనని వ్యాఖ్యానించారు. అనుబంధ సంఘాలను ప్రభుత్వంపై రుద్దేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను ఇప్పటికే రెండుసార్లు ఓడించానని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. కేసీఆర్‌కు ఓటమి కొత్త విషయం కాదని, అలాగే గెలుపు కాంగ్రెస్ పార్టీకి కొత్త కాదని అన్నారు. మహేష్ గౌడ్ వర్సెస్ కేసీఆర్‌గా జరిగిన స్థానిక సంస్థల పోరులో కూడా కేసీఆర్ ఓటమి చవిచూశారని గుర్తు చేశారు. తాము వివక్ష లేకుండా ప్రభుత్వం నడుపుతున్నామని, అన్ని వర్గాల ప్రజలకూ సమన్యాయం చేస్తూ పాలన కొనసాగిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అసెంబ్లీ ప్రాంగణం పార్లమెంట్ తరహాలో పనితీరు ఉండేలా అవసరమైన మార్పులు చేపట్టాల్సి ఉందని సిఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. అసెంబ్లీలో చేపట్టాల్సిన పనులపైన శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్ లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికారులకు పలు సూచనలు చేసారు. ఈసందర్భంగా పార్లమెంట్ తరహా లో అసెంబ్లీ ప్రాంగణం ఉండాలని అభిప్రాయపడ్డారు. సభ గౌరవం పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మెంబర్స్ కి మరింత ప్రైవసీ ఉండాలన్నారు. పబ్లిక్ గార్డె లో మెంబర్స్ కోసం క్లబ్ ఏర్పాటు చేయాలన్నారు. మెంబర్స్ కోసం వాకింగ్ ట్రాక్,క్రీడల కోసం ఏర్పాట్లు ఉండాలన్నారు. వచ్చే సెషన్ నాటికి సెంట్రల్ హాల్ సిద్ధం కావాలని అన్నారు. పార్లమెంట్ సెంట్రల్ హాల్ తరహాలో ఉండాలని సిఎం రేవంత్ గతంలోనే సూచనలు చేశారు. హెరిటేజ్ భవనాలకు నష్టం జరగకుండా చర్యలు ఉండాలని కూడా సూచించారు. అసెంబ్లీ ప్రాంగణం భద్రతని పటిష్టం చేయాలన్నారు.

### అక్రమానిర్మాణాలు చేస్తూ డబ్బులు దండుకునే వారు

## కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేయడం హాస్యాస్పదం

నిజాయితీగల తమ నాయకుని పై స్థాయిలేని వ్యక్తులతో విమర్శలు చేయించడం విడ్డూరం...
గుర్తుపెట్టుకో ఆత్మ నీవు ఇలానే కుతంత్రాలు చేస్తే నీ అక్రమాలు ,అక్రమానిర్మాణాలు, అక్రమార్జన మీద లోతుగా విచారణ చేయిస్తాం...

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :




కూకట్పల్లి నియోజకవర్గంలోని బాలాజీ నగర్, గోపాల్ నగర్, కెపిహెచ్‌బి కాలనీలలో అక్రమా నిర్మాణాలు చేస్తూ వాటిని ప్రోత్సహిస్తూ అక్రమంగా డబ్బులు దండుకునే వారు మా కాంగ్రెస్ నాయకుని పై విమర్శలు చేయటం హాస్యాస్పదం గా ఉందని కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ధ్వజమెత్తారు. కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జ్ బండి రమేష్ మీద స్థాయి లేని వ్యక్తులతో విమర్శలు చేయించిన దానిపై మండిపడ్డారు. కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జ్ బండి రమేష్ మొన్న జరిగిన పత్రిక సమావేశంలో కూకట్పల్లి లో గత 10 ఏండ్ల అభివృద్ధిపై శాసనసభ్యులు మాధవరం కృష్ణారావుకి పలు ప్రశ్నలు సంధించటం జరిగిందనీ దానిపై ఎప్పుడు ఎక్కడైనా బహిరంగ చర్చకు సిద్ధమని చెప్పటం జరిగిందన్నారు. దానిపై స్పందించలేని వారు, కనీస స్తాయిలేని వ్యక్తులతో ఆదికూడా షంషీగూడ,బాలాజీ నగర్,గోపాలనగర్, కెపిహెచ్‌బిలలో అక్రమానిర్మాణాలు చేస్తూ, అక్రమానిర్మాణాలను ప్రోత్సహిస్తూ పైసలు దండుకునే వారు ప్రకటనలు చేయటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ ప్రకటనల వెనుక శాసనసభ్యులు వున్నారని మేము అనుకోమనీ మిమ్మల్ని పూర్తిస్థాయిలో నాశనం చేయటమే ధ్యేయంగా పెట్టుకున్న మీ ఆత్మ మీ దగ్గర మెప్పుకోసం తన భజన సంఘాన్ని దింపాడని మాకు తెలుసు అన్నారు. గుర్తుపెట్టుకో ఆత్మ నీవు ఇలానే కుతంత్రాలు చేస్తే నీ అక్రమాలు ,అక్రమానిర్మాణాలు,అక్రమార్జన మీద లోతుగా విచారణ చేస్తామని అన్నింటినీ బట్టబయలు చేస్తామని హెచ్చరించారు. బండి రమేష్ దుస్తులమీద విమర్శించే మీకు 10 సంవత్సరాల ముందు పరిస్థితి గుర్తు చేసుకోవాలి అన్నారు. ఆత్మ చెప్పినట్టు చేస్తే మళ్ళీ 10 సంవత్సరాల వెనుకకు వెళ్ల వలసి వస్తది, విమర్శలు రాజకీయంగా ఉండాలి సద్విమర్శలు ఉండాలి గాని, వ్యక్తిగతశీ గా ఉండకూడదు అన్నారు. మా నాయకుడు చేసిన విమర్శలకు కట్టుబడి వున్నామనీ ఎప్పుడు ఎక్కడైనా చర్చకు సిద్ధం అని బండి రమేష్ వద్దకు మీ పై ఎన్ని పిర్యాదులు వచ్చిన కక్ష సాధింపులు చేయకూడదు , వ్యక్తిగత విషయాలకు పోకూడదు,రాజకీయాలు ప్రజలకు మేలు చెయ్యాలి తప్ప , మన స్వార్థం కోసం చేయకూడదని చెప్పే గొప్ప మనస్సున్న వ్యక్తి మా నాయకుడు బండి రమేష్ అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మార్కెటింగ్ డైరెక్టర్ ఇజాజ్, ఏ ఎం సి వైస్ చైర్మన్ ప్రకాష్ ముదిరాజ్, డిసిసి స్పోక్స్ పర్సన్ మధుమోహన్ తదితరులు పాల్గొన్నారు.

### కూకట్పల్లిలో ఘనంగా

## బి.ఆర్.ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు...

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :
బిఆర్ఎస్ పార్టీ 26వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కూకట్ పల్లి డివిజన్ ప్రకాష్ నగర్ లో టిఆర్ఎస్ పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి చేగురి ప్రభాకర్, కూకట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బొట్టు విష్ణు తదితరులు పాల్గొని జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ యువజన నాయకులు నైనేని అభిలాష్ రావు, బంతుల చైతన్య, ఉదిగి మహేష్, సిరిగాని పవన్, నూనె రాజు, శ్రీధర్ రెడ్డి, కురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



### వివేకానంద నగర్ డివిజన్లో

## ఘనంగా బి.ఆర్.ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



శేర్లింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని వివేకానంద నగర్ డివిజన్ మాధవరం నగర్ కాలనీ డివిజన్ బి.ఆర్.ఎస్ పార్టీ కార్యాలయం లో భారత రాష్ట్ర సమితి పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పార్టీ జెండాను ఎగరవేసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు స్థానిక నాయకులతో కలసి పార్టీ జెండాని ఆవిష్కరించి కేక్ కట్ చేసి నాయకులకు కార్యకర్తలకు తినిపించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కరరావు స్థానిక నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబం ఖచ్చితంగా వివరాలు నమోదు చేసుకోవాలి

ఏఎం న్యూస్, ఖమ్మం,ఏప్రిల్27:
రాష్ట్రంలోని ప్రజలందరు జనగణనలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ప్రజలంతా తమ వివరాలను స్వయంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే విధానాన్ని ప్రోత్సహిస్తూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్వయంగా ఈ పక్రియను పూర్తి చేశారు. ఈ విధానం ద్వారా జనగణనలో సమాచార సేకరణ సులభతరం అవుతుందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో జనగణన 2027 పక్రియలో భాగంగా, ప్రతి కుటుంబం తమ వివరాలను ఖచ్చితంగా నమోదు చేసుకోవాలని చెప్పారు. దీని ద్వారా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రజలకు సరిగ్గా అందుతాయని ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర, చీఫ్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్, టెక్నీకల్ అసిస్టెంట్ హిమవర్ష తదితరులు పాల్గొన్నారు.

# కోర్టుపై నాకు నమ్మకం పోయింది

ఏఎం న్యూస్, న్యూఢిల్లీ,ఏప్రిల్27:
ఢిల్లీ మద్యం విధానం కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసును విచారిస్తున్న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ ఎదుట హాజరుకావడానికి ఆయన నిరాకరించారు. ఈ మేరకు ఆయన న్యాయమూర్తికి ఒక లేఖ రాస్తూ, కోర్టుపై తనకు 'నమ్మకం పోయిందని' సంచలన వ్యాఖ్యలు చేశారు. తన అంతరాత్మ ప్రబోధం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేజ్రీవాల్ వెల్లడించారు. 'న్యాయం జరుగుతుందన్న ఆశలు ఆవిరయ్యాయి. అందుకే మహాత్మా గాంధీ చూపిన సత్యాగ్రహ మార్గంలో నడవాలని నిర్ణయించుకున్నాను. వ్యక్తిగతంగా గానీ, కనీసం నా తరఫు న్యాయవాది ద్వారా గానీ విచారణకు హాజరుకాను' అని ఆయన లేఖలో పేర్కొన్నారు. అయితే, చట్టపరంగా తనకు ఉన్న హక్కుల ప్రకారం ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని ఆయన స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే, సోమవారం విచారణకు కేజ్రీవాల్ గైర్హాజరు కావడంతో హైకోర్టు తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. ఒకవైపు బెంగాల్ ఎన్నికల వేడి, మరోవైపు కేజ్రీవాల్ చుట్టూ తిరుగుతున్న ఈ న్యాయ వివాదాలు దేశ రాజకీయాల్లో వేడిని పెంచుతున్నాయి.మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్‌తో పాటు ఇతర నిందితులను ట్రయల్ కోర్టు గతంలో విడుదల చేసింది. దీనిని సవాలు చేస్తూ సీబీఐ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను జస్టిస్ స్వర్ణకాంత శర్మ విచారిస్తున్నారు. అయితే, ఈమె గతంలో కేజ్రీవాల్ అరెస్ట్‌ను సమర్థిస్తూ తీర్పునిచ్చారని, అలాగే ఆమె కుటుంబ సభ్యులకు ప్రభుత్వంతో సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ.. ఈ కేసు నుంచి ఆమె తప్పుకోవాలని కేజ్రీవాల్ పిటిషన్ వేశారు. గత ఏప్రిల్ 20 ఈ పిటిషన్‌ను జస్టిస్ స్వర్ణకాంత శర్మ కొట్టివేశారు. 'న్యాయమూర్తుల నిజాయతీని లిటిగెంట్లు విచారించలేరు. కేవలం ఊహల ఆధారంగా రీక్యూసల్ కోరలేరు' అని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో ఒక మాజీ ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి, స్వయంగా న్యాయమూర్తికి వ్యతిరేకంగా ఇలాంటి నిర్ణయం తీసుకోవడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. న్యాయవ్యవస్థపై కేజ్రీవాల్‌కు గౌరవం లేదని బీజేపీ విమర్శిస్తుంటే, తమ నాయకుడికి అన్యాయం జరుగుతోందని ఆప్ నేతలు ఆరోపిస్తున్నారు.

## అల్లాపూర్‌లో 4.17 గుంటల విస్తీర్ణం కలిగిన భూమి

# ప్రస్తుతం 2 ఎకరాల విస్తరణంకు రావడానికి కారణం ఎవరు?

**మీ స్థానిక నాయకుడు కాదా? ప్లాట్లుగా చేసి పేదవారికి అమ్మి నిర్మాణాలు చేయించింది ఎవరు...**
**హైడ్రాతో, రెవిన్యూ తో, లేదా పోలీస్ వారితో ఎవరితో విచారణ చేపిద్దామో మీరే నిర్ణయించండి...**
**రాజకీయాల కంటే ప్రజల సంక్షేమమే మాకు ముఖ్యం, కూకట్పల్లి అభివృద్దే మా ధ్యేయం...**
**టిపిసిసి ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బండి రమేష్**

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి : కాంగ్రెస్ పార్టీ నాయకులపై పార్టీపై ఆరోపణలు మాని అభివృద్ధిపై కూకట్పల్లి ఎమ్మెల్యే దృష్టి సారించాలని, కాంగ్రెస్ పార్టీ పై చేసే ఆరోపణలకు తాము బహిరంగ చర్చకు ఎప్పుడైనా సిద్ధమని తమకు పార్టీ కంటే ప్రజల సంక్షేమమే ముఖ్యమని టిపిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్ పేర్కొన్నారు. కూకట్పల్లి శాసనసభ్యులు అల్లాపూర్ సర్వే నెంబర్ 18 ని సందర్భించి యధావిధిగా కాంగ్రెస్ పార్టీ పై ఆరోపణలు చేసిన దానిపై సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసిన టిపిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్ ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నెంబర్ 18 అల్లాపూర్ లో 4 ఎకరాల 17 గుంటల విస్తీర్ణం కలిగిన ప్రభుత్వ భూమి దీనిలో 10 సంవత్సరాల నుండి మదర్సా నిర్మిస్తామని చెబుతూ రెండు సార్లు శాసనసభ ఎన్నికలలో ఓట్లు దండుకున్నారని అదేవిధంగా రెండు సార్లు కార్పొరేటర్ ఎన్నికలలో ఓట్లుదండు కున్నారని చెప్పారు. దాదాపు 4 .17 గుంటల విస్తీర్ణం కలిగిన భూమి ప్రస్తుతం 2 ఎకరాల విస్తరణంకు రావడానికి కారణం ఎవరు ? మీ స్థానిక నాయకుడు కాదా ? ప్లాట్లుగా చేసి పేదవారికి అమ్మి నిర్మాణాలు చేయించింది ఎవరు ? హైడ్రా తో , రెవిన్యూ తో, లేదా పోలీస్ వారితో ఎవరితో విచారణ చేపిద్దామో మీరే నిర్ణయించండి మీకు మేము సహకరిస్తాము అన్నారు. పేదవారు తెల్వక మీ నాయకుల వద్ద కొని నిర్మించిన నిర్మాణాలు తొలిగిస్తే వారి ఉసురు మీకు మీ నాయకులకు తగులుతుందన్నారు. హైడ్రా వారిపై మీకెందుకు అంత ఆక్రోశమో తెల్వదు గని ప్రజలచేత ప్రశంసలు పొందుతున్న వారిపై ఎప్పుడు బురద చల్లుతూ ఉంటారని మీ ఆలోచన విధానము మార్చుకోండనీ హితవు పలికారు. యధావిధిగా మీరు బట్టకాల్చి మీద వేసినట్టుగా దీనికి కాంగ్రెస్ పార్టీకి లింక్ పెడుతూ 400 కోట్ల భూమి మా పార్టీ వారు కబ్జా చేస్తున్నారని బురద చల్లారు ఇక్కడ కూడా మీకే అవకాశం ఇస్తున్నాము మా నాయకులూ ఎవరో పేర్లు బయట పెడితే వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవటమే కాకుండా మీకు ప్రజల సమక్షంలో క్షమాపణలు చెప్పిస్తామని తెలుపుతున్నాం అన్నారు. రెవిన్యూ శాఖ వారు పోలీస్ శాఖ వారు వెంటనే స్పందించి అక్రమానిర్మాణాలను కూల్చడమే కాకుండా వారిపై కేసులు నమోదు చేసారని ప్రజలకు ఈ సందర్భంగా తెలియ చేస్తున్నామనీ చెప్పారు. మేము చేసే ఏ ఛాలెంజ్ అయినా ఎక్కడైనా ఎప్పుడైనా చర్చకు సిద్ధం , మాకు రాజకీయ మేలు కంటే ప్రజల మేలే ముఖ్యం , కూకట్పల్లి అభివృద్దే మా ధ్యేయం అని బండి రమేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## అన్ని దానాల్లోకెల్లా రక్తదానం మిన్న...

**రక్తదానం చేయడం వల్ల సకాలంలో ప్రాణాలను కాపాడవచ్చు...**
**జనసేన కూకట్పల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్...**

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి : అన్ని దానాల్లో కల్లా రక్తదానం గొప్పదని, రక్తదానం చేయడం వల్ల ప్రాణాలను కాపాడవచ్చు నీ జనసేన పార్టీ కూకట్పల్లి కంటెస్టెంట్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ పేర్కొన్నారు. తలసీమియా రహిత తెలంగాణ రాష్ట్రం కోసం చత్రపతి ధర్మ రక్షణ సేన అధ్యక్షుడు కర్ర వేణు గోపాల్ ఆధ్వర్యంలో కేపీహెచ్బీ రోడ్ నెంబర్ 1 లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది తలసీమియా సోకిన వారికి నెలకు ఒకసారి రెండు నెలలకు ఒకసారి రక్త మార్పిడి చేయవలసి ఉంటుంద నీ చెప్పు ఇప్పుడు వేసవికాలం కావడంతో రక్తం కొరత ఏర్పడుతుందనీ దానికి స్పందించి చత్రపతి ధర్మరక్షణ సేన తలసీమియా వ్యాధిగ్రస్తులకు సపోర్టుగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జనసేన పార్టీ కో ఆర్డినేటర్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రేమకుమార్ మాట్లాడుతూ తలసీమియా రహిత తెలంగాణ ఏర్పాటు కోసం అందరం కృషి చేయాలని ,ప్రపంచంలోనే తయారు చైయలేనిది అంటే కేవలం రక్తం ఒకటే అని,యువత ఇలాంటి రక్తం దానం చేయడం చూసి ఒక్క సారి రక్తదానం చేస్తే మీ జీవితంలో మీరు ఒక్క రోగి ప్రాణాన్ని కాపాడినట్టే, మీ కుటుంబం కూడా 'రక్తదాత' కుటుంబంగా గుర్తించబడుతుంది వారిని అభినందించారు. కర్ర వేణుగోపాల్ ఈ రోజు 122 యూనిట్ ల రక్తం దాతల నుండి సేకరించామని తెలిపారు. సహకరించిన రక్త దాతలను, వారి కమిటీ సభ్యులందరినీ అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కర్రి. బాలసుబ్రమణ్యం, గాలి అనిత ,తాండూర్ సునీత,జి.నాగేంద్ర ప్రసాద్,నాగేశ్వర్ గుప్తా,ఎస్. పవన్,కర్ర.లక్ష్మీ ప్రసన్న,కే. లక్ష్మి, పి. పవన్, వినోద్, హరిబాబు జనసేన నాయకులు కొల్లా శంకర్, పోలెబోయిన శ్రీనివాస్, సలాది శంకర్, దాసరి వెంకట్ , తదితరులు పాల్గొన్నారు.



## మీడియా సమావేశంలో పాల్గొన్న రావుల శ్రీధర్ రెడ్డి

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ : బిఆర్ఎస్ పార్టీ స్థాపించి 25 వ(2001,ఏప్రిల్ 27)ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రహమత్ నగర్ డివిజన్ (జూబ్లీహిల్స్ నియోజకవర్గం) బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కమటం నర్సిం హారెడ్డి ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో టీఎస్ఈడబలయూఐడిసి మాజీ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు, రావుల శ్రీధర్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ స్వరాష్ట్రం ఏర్పడ్డాక 10 ఏళ్ల కెసిఆర్ గారి పాలనలో అన్ని వర్గాల అభ్యున్నతితో రాష్ట్రం సుబిక్షంగా వర్ధిల్లిందని, రాష్ట్ర ప్రజలు రాష్ట్రంలో మళ్ళీ కెసిఆర్ పాలన కోరుకుంటున్నారని, పార్టీ ఆవిర్భావ దినోత్సవ స్ఫూర్తితో, తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం కట్టబడి పనిచేస్తామని, రాబోయే ఎన్నికల్లో కెసిఆర్ నాయకత్వంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి క్షేత్ర స్థాయిలో పార్టీ శ్రేణులు పనిచేసి బిఆర్ఎస్ పార్టీ ని మళ్ళీ అధికారంలోకి తీసుకొని రావడానికి వారి కర్తవ్యాన్ని నిర్వహించి,పార్టీ అధికారంలోకి తీసుకుని వచ్చే విధంగా వారి ప్రయత్నం, నా కృషి ఉంటుందని పత్రికా ముఖంగా తెలుపుతున్నాను అని అన్నారు. ఈ మీడియా సమావేశంలో బి.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సురేందర్ కంకట, రాకేష్ క్రిస్టోఫర్, చాపల కృష్ణ, కమటం లలితా రెడ్డి, సోని శ్రీశైలం యాదవ్, మల్లేష్ పల్లపు, అబ్దుల్ గన్ని, గడ్డం శ్రీధర్, ఫ్రాంక్లిన్, పౌల్, విజయ్ కిరణ్, అశోక్ ,లక్మయ్య, బబ్లూ, అల్తాఫ్ , కిరణ్ యాదవ్ , కురుమూర్తి, శ్రీనివాస్, ఫయాజ్ పాల్గొన్నారు



## గులాబీ జెండాను ఆవిష్కరించిన మన్నె గోవర్ధన్ రెడ్డి

ఎ ఎం న్యూస్, ఖైరతాబాద్ :



2001 ఏప్రిల్ 27న టిఆర్ఎస్ (బిఆర్ఎస్ పార్టీగా మారిన) పార్టీని స్థాపించారు కే.చంద్రశేఖర రావు. పార్టీ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని (గులాబీ జెండా ఆవిర్భావ దినోత్సవం) ఖైరతాబాద్ నియోజకవర్గం వెంకటేశ్వర డివిజన్ సుగ్దేవ్ నగర్ వద్ద, బి.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఖైరతాబాద్ నియోజకవర్గ బి.ఆర్.ఎస్ పార్టీ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి గులాబీ జెండాను ఆవిష్కరించి, తెలంగాణ సాధనలో పోరాడిన అమర వీరులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మన్నె గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ అభివృద్ధి కోసం గులాబీ జెండా మార్గదర్శకంగా నిలుస్తుందని, ప్రజల ఆశయాల సాధన కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, పాల్గొన్నారు

### కెపిహెచ్బి కాలనీలో ఘనంగా

## బి.ఆర్.ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు...

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి : బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ పిడకలు కేపీహెచ్బీ కాలనీలో సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కేపిహెచ్బి డివిజన్ మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి 9వ ఫేస్ లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్క రించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మందడి శ్రీనివాస రావు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధినీ ప్రజలు ఇప్పటికీ గుర్తు పెట్టుకుంటున్నారని ప్రజల ఆకాంక్షల నెరవేర్చేలా తిరిగి మళ్లీ బిఆర్ఎస్ పార్టీ రాబోయే ఎన్నికలలో అఖండ మెజారిటీ సాధించి ముఖ్యమంత్రిగా కేసీఆర్ పదవి బాధ్యతలు చేపడతారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



### మహిళా సేవారత్న అవార్డు

## దక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ బి.రూప

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :







వివిధ రంగాలలో ఉత్తమ సేవలు అందించిన వారికి వరించే మహిళల అవార్డు అయిన ఉత్తమ సేవా రత్న అవార్డును జూబ్లీహిల్స్ నియోజక వర్గం వెంగల్ రావు నగర్ డివిజన్ జవహర్ నగర్ స్థానిక నివాసి, కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ, అక్క అని పిలిస్తే నేనున్నా అని పలికే బి.రూప కి దక్కింది. వివరాల్లోకెళ్తే త్రివేణి సంగమం కల్చర్ అకాడమీ హైదరాబాద్ బుద్ధ పూర్ణిమ పురస్కారాలు (2006)లో భాగంగా రాజా రమణ . (ఫౌండర్, ప్రెసిడెంట్) సమక్షంలో ఉపాసకులు, దైవాజ్ఞ శర్మ గురువు చేతుల మీదుగా మహిళా సేవా రత్న అవార్డు ను బి.రూప అందుకున్నారు. ఈ సందర్భంగా రూప మాట్లాడుతూ ఉత్తమ సేవ రత్న అవార్డు నాకు బాధ్యతను పెంచిందని అన్నారు.

## ఆల్విన్ కాలనీ డివిజన్లో

## ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు...

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ,శేరిలింగంపల్లి ఇంచార్జ్ కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు సోమవారం ఆ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు ఆధ్వర్యంలో ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ గుడ్విల్ చౌరస్తా, సుభాష్ చంద్ర బోస్ కాలనీలలో పార్టీ జెండా ఎగరవేసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు అనిల్ రెడ్డి, రాములు గౌడ్, సురభి రమేష్ రావు, సమ్మద్, జూపల్లి జనార్దన్ రావు, శ్రీనివాస్, సాయి గౌడ్, వెంకట్, నాగేశ్వర్ రావు, మురళి గౌడ్, రాజు, శ్రీధర్ రావు, రాము, స్వామి, రమేష్, సురేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

### సర్దార్ పటేల్ కళాశాలలో

## ప్రతిభని అభినందించిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :



సికింద్రాబాద్ పద్మారావు నగర్‌లోని సర్దార్ పటేల్ ఎంబిఎ కళాశాలలో నిర్వహించిన మేనేజ్మెంట్ బిజినెస్ సమన్వయ 2026 ఫెస్ట్ కార్యక్రమానికి నిర్వాహకుల పిలుపుమేరకు ముఖ్య అతిథిగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ హాజరయ్యారు. కళాశాల యాజమాన్యం ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ కి ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను నవీన్ యాదవ్ పరిశీలించి, వారి ప్రతిభను అభినందించారు. అనంతరం కళాశాల ఆవరణలో ఉన్న సర్దార్ పటేల్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. తదుపరి ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు నాయకత్వ లక్షణాలు, వ్యాపార దృష్టి, సాంకేతిక పరిజ్ఞానం అలవరుచుకుని భవిష్యత్తులో దేశాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు, పాల్గొన్నారు.

### ఫేస్ 1లో బిఆర్ఎస్ పార్టీ జెండాని

## ఆవిష్కరించిన రాగం దేవేందర్ యాదవ్..

ఏ ఎం న్యూస్, పటాన్చెరు :



2001లో టిఆర్ఎస్ గా ప్రారంభమై, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, అనంతరం భారత రాష్ట్ర సమితిగా జాతీయ పార్టీగా రూపాంతరం చెందింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామం పట్టణం నియోజకవర్గం జిల్లా కేంద్రాల్లో, పార్టీ జెండాలను ఎగరవేయాలని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపునిచ్చారు. ఆ పిలుపులో భాగంగా సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలం పటాన్చెరు నియోజకవర్గం నూతనంగా జిహెచ్ఎంసిలో కలిసిన తెల్లాపూర్ పరిధిలోని కెసిఆర్ నగర్ డబల్ బెడ్ రూమ్ ఫేస్ 1 మెయిన్ గేట్ వద్ద సోమవారం పార్టీ ముఖ్య నాయకులు, సీనియర్ నాయకులు, ఫేస్ వన్(1) లోని బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు రాగం దేవేందర్ యాదవ్(బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు) ఈ కార్యక్ర మంలో ఉమేస్వర్(మాజీ కౌన్సిలర్), దయాకర్ రెడ్డి (మాజీ టెలిఫోన్ బోర్డు చైర్మన్), సోమిరెడ్డి (మాజీ వైస్ చైర్మన్), బుచ్చిరెడ్డి (మాజీ ఫ్యాక్స్ చైర్మన్), ఇంద్రారెడ్డి తోపాటు ఫేస్ వన్ నివాసి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నిరంజన్, మహిళా నాయకురాలు గోరిఖాన్, నుషారత్, తో పాటు సీనియర్ నాయకులు కళ్యాణ్ కుమార్, ఆసిఫ్, తుప్పకుల శ్రీనివాస్, మొయిజ్,కాజా, తాహేర్, గౌస్, హుస్సేన్, పటేల్, బురాన్,సయ్యద్, రహమత్ బేగ్, సంతోష్, షేరు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన అందరికీ బిఆర్ఎస్ పార్టీ కండువాలను నిరంజన్ స్వయంగా వేసి, పార్టీ ఆవిర్భావ దినో త్సవ వేడుకలను ఘనంగా జరపడంలో సమర్థవంతంగా తన వంతు పాత్ర పోషించారు. మార్పు రావాలి, కెసిఆర్మళ్లీ రావాలి అనేనినాదంతో ఫేస్1మెయిన్‌గేట్‌ప్రాంగణంమొత్తం దద్దరిల్లిపోయింది.

## జెండాని ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్ రెడ్డి

## పాల్గొన్న మాజీ కార్పొరేటర్ దేదీప్య..

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :



2001లో టిఆర్ఎస్‌గా ప్రారంభమై, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, అనంతరం భారత రాష్ట్ర సమితి గా జాతీయ పార్టీగా రూపాంతరం చెందింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామం పట్టణం నియో జకవర్గం జిల్లా కేంద్రాల్లో, పార్టీ జెండాలను ఎగరవేయాలని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపు నిచ్చారు. ఆపిలుపులో భాగంగా సోమవారం బిఆర్ఎస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజక వర్గంలోని పలు డివిజన్లో జరిగిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డితో పాటు మాజీ కార్పొరేటర్ (వెంగళరావునగర్ డివిజన్) దేదీప్య. ఈ కార్యక్రమంలో భాగంగా జవహర్ నగర్ సాయిబాబా ఆలయం ఎదురుగా ఏర్పాటుచేసిన జెండా ఆవిష్కరణ కార్యక్ర మంలో ముఖ్య నాయకులు, సీనియర్ నాయకులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షం లో బిఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు మాజీ ఎమ్మెల్యే పి. విష్ణువర్ధన్ రెడ్డి. జెండా ఆవిష్క రణ కార్యక్ర మంలో మాజీ కార్పొరేటర్ దేదీప్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్యామ్ రావు, సోహెల్, విజయ్ ముదిరాజ్, ఎర్రగడ్డ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సంజీవ్, షేక్పేట్ డివిజన్ ప్రెసిడెంట్ ప్రదీప్, రహమత్ నగర్ డివిజన్ ప్రెసిడెంట్ అరుణ్, సీనియర్ నాయ కులు రాకేష్, తరుణ్, రవికాంత్, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే సుశీల్, లియాకత్ అలీ, అప్సర్, వినయ్ సింగ్, శివ,బాలు రజక, అబ్దుల్లా, విజయ్‌గౌడ్, శారద, సుజాతపాల్గొన్నారు. మార్పు రావాలి కేసీఆర్ మళ్లీ రావాలి అనే నినాదంతో జండా ఆవిష్కరణ చేసిన ప్రాంగణం మొత్తం దద్దరిల్లిపోయింది

### మహేందర్ రెడ్డి పై చేస్తున్న ఆరోపణలను

## స్పోర్ట్స్ ఫెడరేషన్ తీవ్రంగా ఖండిస్తోంది..

ఏ ఎం న్యూస్, ఓయూ:



తెలంగాణ కబడ్డీ ఆఓసియేషన్ సెక్రటరీ మహేందర్ రెడ్డి పై దుష్ప్రచారం మానుకోవాలని స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఉస్మానియా యూనివర్సిటీ ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ నేతలు మాట్లాడుతూ తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ మహేందర్ రెడ్డి అర్హతపై మరియు ఆయనపై జరుగుతున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైన్నారు. మహేందర్ రెడ్డి పై చేస్తున్న ఆరోపణలను స్పోర్ట్స్ ఫెడరేషన్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. కావాలని ఆయనపై కొంతమంది కుట్రపూరితంగా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. మహేందర్ రెడ్డి కబడ్డీ క్రీడాకారుడిగా క్రీడా విలువలు, నిబద్ధత, క్రమశిక్షణ కలిగిన వ్యక్తి అన్నారు. క్రీడాకారుల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ తెలంగాణ కబడ్డీని అంచెలంచెలుగా ముందుకు తీసుకెళు న్నారన్నారు. ఈ అభివృద్ధిని తట్టుకోలేక కొన్ని కబడ్డీ క్లబ్బులు, కొంతమంది క్రీడాకారులను రెచ్చగొడుతూ రాజకీయపరమైన వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇది పూర్తిగా రాజకీయ కోణంలో జరుగుతున్న కుట్రగా మేము భావిస్తున్నాం అన్నారు.

# బయటి వ్యక్తులు ఫేస్ 1,2,3 లో కటింగ్ షాపులు ఏర్పాటు చేయవద్దు

### – అధ్యక్షుడు సాయి సూరజ్ నాయి

ఏ ఎం న్యూస్, పటాన్చెరు : సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలం పటాన్చెరు నియోజకవర్గం నూతనంగా జిహెచ్ఎంసి లో కలిసిన తెల్లాపూర్ పరిధిలోని కేసీఆర్ నగర్ డబల్ బెడ్ రూమ్ ఫేస్ 2 లో శ్రీ ధన్వంతరి నాయి బ్రాహ్మణ సేవా సంఘం 2 బి హెచ్ కె సొసైటీ ఏర్పాటు చేసుకున్నారు. కుల వృత్తిలో భాగంగా ఫేస్ 1, 2, 3 లో కటింగ్ షాపులు ఏర్పాటు చేసుకొని వినియోగదారులకు సేవలందిస్తున్నారు. కుల వృత్తులను చేసుకుంటూ ఉన్న మాకు డబల్ బెడ్ రూమ్ ఫేస్ 1,2,3లో బయటి వ్యక్తులు (నాయి బ్రాహ్మణ కులానికి సంబంధించిన వాళ్ళు కాకుండా) కటింగ్ షాపులను ఏర్పాటు చేస్తున్నారనే విషయం తెలిసిన సందర్భంగా కమిటీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది ఈ సమావేశానికి సంబంధించిన అంశాలను అధ్యక్షుడు సాయి సూరజ్ నాయి ఏ. ఎమ్.న్యూస్. మీడియా రిపోర్టర్‌తొ ప్రస్తావిస్తూ ఫేస్ 2లో ఎవరైనా షాపు పెట్టవలసిన వారు తమ సంఘం సభ్యులను సంప్రదిం చాలని తెలిపారు. ఫేస్ 2లో ఎవరైనా సంఘంలో చేరాలను కుంటే మమ్మల్ని సంప్రదించాలని అన్నారు. సంఘం నిబంధన లను పాటించాలని అన్నారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మొన్న జరిగిన దుకాణాల విక్రయం వేలం పాటలో షాపుని స్వంతం చేసుకున్న వారు ఇక్కడ కటింగ్ షాప్ పెట్టవద్దని ఇక్కడ ఉన్న కటింగ్ షాపులు ఏమవుతాయని, ఎలా బతకాలని, ఎప్పటినుంచో ఉండి ఇక్కడ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకునే విధంగా నాయి బ్రాహ్మణ సంఘం ని ఏర్పాటు చేసి, సంఘంలో ఎవరికైనా ఏ ఇబ్బంది వచ్చినా సంఘం ద్వారా వారికి సహాయం చేయాలనుకుని ఉన్న మాకు, మీరు షాపు పెట్టడం వలన మా ఆర్థిక పరిస్థితులు కూలుతాయి. ఒకవేళ మీరు నాయి బ్రాహ్మణులు అయి ఉంటే మాతో సంప్రదించిన తర్వాతనే ముందుకు వెళ్లాలని కోరుతున్నాం. బయట కులాల వారు నాయి బ్రాహ్మణులమని మా సంఘ సభ్యులకు తెలియపరచకుండా షాప్ పెడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ విషయం మీద దేనికైనా వెనకాడబోమని, ఎంత దూరమైనా వెళ్తామని మీడియా ద్వారా స్పష్టం చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్ నాయి ( వైస్ ప్రెసిడెంట్), లక్ష్మీ ప్రసాద్ నాయి (జనరల్ సెక్రెటరీ ), ముఖేష్ నాయి(కోశాధికారి), అభిలాష్ నాయి (జాయింట్ సెక్రెటరీ), నారాయణ నాయి, కొండల్ నాయి, నరసింహనాయి, పాల్గొన్నారు. డబల్ బెడ్ రూమ్ జిహెచ్ఎంసికి సంబంధించిన అధికారులు కు మేము విన్నవించేది ఏమిటంటే ఎప్పటి నుంచో కులవృత్తినే ఆధారంగా చేసుకొని కటింగ్ షాపుల ను ఏర్పాటు చేసుకున్నామని, ఇప్పుడు వేలంపాటలో దుకాణాలు కొన్నామని బయటి నుంచి వచ్చిన వ్యక్తులు దుకాణాలు పెట్టు కుంటే మా జీవితాలు ఆగమవుతాయని, మీరు మానవతా దృక్ప థంతో ఈ విషయాన్ని ఆలోచించి ఎవరైతే కటింగ్ షాపులు ఏర్పా టు చేస్తున్నాను అంటున్నారో వారికి ఆ నిర్ణయం విరమించు కోవాలని, మీరు ఆ దిశగా( దుకాణాల తాళాలు ఇచ్చేటప్పుడు వాళ్లు పెట్టే వ్యాపారం గురించి మీకు తెలుస్తుంది కదా, అప్పుడు) మాకు న్యాయం చేయాలని మిమ్మల్ని కోరుతున్నామని అన్నారు.



# కార్తీతో బోయపాటి మూవీ
## చిత్రపరిశ్రమలో పుకార్ల షికారు



టాలీవుడ్‌లో 'మాస్ సినిమాల చిరునామా'గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న బోయపాటి శ్రీను, స్క్రీన్ మీద హీరోని ఎంత పవర్‌ఫుల్‌గా చూపించవచ్చో, విలన్‌ను ఎంత భయంకరంగా సృష్టించవచ్చో.. బోయపాటి సినిమాలను చూస్తే అర్థమవుతుంది. కేవలం ఫైట్లు, రక్తం మాత్రమే కాకుండా, ప్రేక్షకుడి నరాల్లో రక్తం ఉడికేలా చేసే హై-వోల్టేజ్ ఎలివేషన్లు ఆయన సొంతం. ఒక సాధారణ కథను కూడా తనదైన మేకింగ్ స్టైల్‌తో వెండితెరపై ఒక విజువల్ వండర్‌గా మార్చడంలో ఆయన దిట్ట. మొదటి సినిమా నుండి మొన్నటి 'అఖండ-2' వరకు ఆయన ఎంచుకునే యాక్షన్ సీక్వెన్స్, డైలాగ్ డెలివరీలో ఒక ప్రత్యేకమైన 'బోయపాటి మార్క్' స్పష్టంగా కనిపిస్తుంది. అయితే, అఖండ-2 తర్వాత ఆయన ఎవరితో జతకట్టబోతున్నారనే విషయంపై గత కొద్ది రోజులుగా ఇండస్ట్రీ వర్గాల్లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. మొదట ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో సరైనోడు-2 సినిమా ఉంటుందని ప్రచారం జరిగినప్పటికీ, వివిధ కారణాల వల్ల అది పట్టాలెక్క లేదు. ఆ తర్వాత బాలీవుడ్ హీరోలతో సినిమా ఉంటుందని వార్తలు వచ్చినా, అవి కేవలం పుకార్లుగానే మిగిలిపోయాయి. తాజాగా, కోలీవుడ్ స్టార్ హీరో కార్తీ పేరు తెరపైకి రావడంతో సినీ ప్రియుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. తెలుగు, తమిళ భాషల్లో మంచి ఫ్యాన్ బేస్ ఉన్న హీరో కార్తీ కి మాస్ యాక్షన్ సినిమాలంటే మక్కువ ఎక్కువే. మరోవైపు బోయపాటి శ్రీను తనదైన శైలిలో హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామాలను వెండితెరపై ఆవిష్కరించడంలో దిట్ట. వీరిద్దరి కలయికలో సినిమా వస్తుందనే వార్త ఇప్పుడు సోషల్ మీడియాలో 'టాక్ ఆఫ్ ది టౌన్'గా మారింది. కార్తీ ఇమేజ్‌కు సరిపడే పక్కా మాస్ కథను బోయపాటి ఇప్పటికే సిద్ధం చేశారని, ఈ ప్రాజెక్ట్ గనుక ఓకే అయితే సౌత్ ఇండియాలో ఇదొక భారీ క్రేజీ కాంబినేషన్ అవుతుందని ఇన్‌సైడ్ టాక్ వినిపిస్తోంది. సాధారణంగా బోయపాటి సినిమాల్లో హీరోల ఎలివేషన్స్, యాక్షన్ సీక్వెన్స్ పీక్స్‌లో ఉంటాయి. కార్తీ కూడా ప్రయోగాత్మక సినిమాలతో పాటు కమర్షియల్ ఎంటర్‌టైనర్లలో తనదైన ముద్ర వేశారు. తెలుగు మార్కెట్‌పై పట్టు పెంచుకుంటున్న కార్తీకి, బోయపాటి మాస్ ఇమేజ్ తోడైతే బాక్సాఫీస్ వద్ద రికార్డులు తిరగరాయడం ఖాయం అని అంటున్నారు.



# శరవేగంగా కల్కి-2 షూటింగ్
## తమిళ నటుడు శింబు కూడా చేరినట్లు ప్రచారం



రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కించిన 'కల్కి చిత్రం బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేసి వెయ్యి కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. పురాణాల ఆధారంగా భవిష్యత్ నేపథ్యంలో సాగిన ఈ సినిమా ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ఇప్పుడు ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'కల్కి 2'ను మరింత భారీ స్థాయిలో తీసుకురావడానికి మేకర్స్ సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా సాగుతున్నాయి. కథను మరింత లోతుగా, భావోద్వేగపూర్వకంగా తీర్చిదిద్దేందుకు దర్శకుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు సమాచారం. మొదటి భాగంలో చూపించిన ప్రపంచాన్ని విస్తరించి, కొత్త పాత్రలు, ఆసక్తికరమైన మలుపులతో సీక్వెల్‌ను రూపొందించాలని ప్లాన్ చేస్తున్నారు. తాజాగా వినిపిస్తున్న వార్తల ప్రకారం ఈ సీక్వెల్‌లో ఒక పవర్‌ఫుల్ స్పెషల్ పాత్ర ఉండబోతుందని, అది క్లైమాక్స్‌లో కీలకంగా మారుతుందని టాక్. ఆ పాత్ర కోసం తమిళ స్టార్ హీరో శింబును సంప్రదించినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆయన ఈ సినిమాలో నటిస్తే తమిళ మార్కెట్‌లో సినిమాకు మరింత బలం చేకూరే అవకాశముందని అంటున్నారు. మొదటి భాగం చివర్లో ప్రభాస్ పాత్రను కర్ణుడిగా చూపిస్తూ మేకర్స్ ఇచ్చిన ట్విస్ట్ ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. దీంతో సీక్వెల్‌పై ఆసక్తి మరింత పెరిగింది. ఈసారి కథ ప్రధానంగా కర్ణుడి గతం, అతని గాథ, తిరిగి రావడం వంటి అంశాలపై నడుస్తుందని సమాచారం. బాలీవుడ్ లెజెండ్ అమితాబ్ బచ్చన్ ఇప్పటికే షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఆయన మళ్లీ అశ్వత్థామ పాత్రలో కనిపించనున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుగుతుండగా, బిజీ షెడ్యూల్ కారణంగా అభిమానులను కలవలేకపోయానని ఆయన తెలిపారు. ప్రభాస్ కూడా త్వరలో షూటింగ్‌లో చేరనున్నారని సమాచారం. ఇక మరో ముఖ్య ఆకర్షణగా కమల్ హాసన్ కూడా ఈ సీక్వెల్‌లో కనిపించనున్నారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ చాలా ఏళ్ల తర్వాత మళ్లీ కలిసి నటిస్తుండడం విశేషం. ఇక ఈ సినిమాలో దుల్కర్ సల్మాన్, జేడీ చక్రవర్తి కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నట్లు సమాచారం. దీంతో 'కల్కి 2'కు భారీ తారాగణం సిద్ధమవుతోంది.

# జూన్ 25న పెద్ది విడుదల ఖాయం
## దర్శకుడు సానా బుచ్చిబాబు వెల్లడి



రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న 'పెద్ది' చిత్రం విడుదలపై క్లారిటీ వచ్చింది. ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడిన ఈ చిత్రం ఫైనల్‌గా జూన్ 25న విడుదల కానుందని రెండ్రోజులుగా వార్తలు హల్‌చల్ చేస్తున్న సంగతి తెలిసిందే! అయితే దీనిపై దర్శకుడు సాన బుచ్చిబాబు క్లారిటీ ఇచ్చారు. ధనుష్ హీరోగా నటించిన 'కర' చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ఆయన అతిథిగా హాజరయ్యారు. అక్కడ 'పెద్ది రిలీజ్ ఎప్పుడు అని అభిమానులు గోల చేయగా బుచ్చి విడుదల తేదిని ప్రకటించారు. ఎట్టి పరిస్థితుల్లో జూన్ 25 సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుందని తెలిపారు. దీంతో అభిమానులు కాస్త ఊరట చెందారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో క్రీడా నేపథ్యంలో సాగే చిత్రమిది. ఇందులో చరణ్ సరసన జాన్వీకపూర్ నటిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన రెండు పాటలు దుమ్ము లేపేశాయి. త్వరలో ఓ డ్యూయెట్ రానుంది. ఆ తర్వాత శ్రుతీహాసన్, రామ్‌చరణ్‌పై చిత్రీకరిస్తున్న ప్రత్యేక గీతాన్ని విడుదల చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. షూటింగ్ ఆలస్య, పోస్ట్ ప్రొడక్షన్ పనులు సమయం సరిపోకపోవడం వల్ల విడుదల వాయిదా పడిన సంగతి తెలిసిందే.

Mana Cinemalu

# ఎంఎస్ సుబ్బలక్ష్మి బయోపిక్
## సాయిపల్లవి కాదు కాదు...రుక్మిణీ వసంత్



జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి రూపొందించబోతున్న సంగీత సామ్రాజ్ఞి ఎమ్మెస్ సుబ్బులక్ష్మి బయోపిక్‌లో సాయిపల్లవి నటించబోతోందనే వార్త కొంతకాలంగా మీడియాలో చక్కర్లు కొడుతోంది. అలానే ఆమె పేరుతో పాటు నయనతార పేరు కూడా ఆ మధ్య వినిపించింది. అలా మరో ఇద్దరు ముగ్గురి పేర్లనూ ఎమ్మెస్ సుబ్బులక్ష్మి పాత్రతో ముడి పెట్టి కొందరు ప్రచారం చేశారు. అయితే ఫైనల్‌గా సాయిపల్లవి దగ్గరే అది ఆగింది. కానీ ఇప్పుడు ఆ పాత్ర సాయి పల్లవి చేజారి... రుక్మిణీ వసంత్ ను చేరిందని వార్తలు వస్తున్నాయి. సాయిపల్లవికి ఈ పాత్ర చేయాలనే కోరిక బలంగా ఉన్నా... ఇప్పటికే ఆమె కమిట్ అయిన సినిమాల కారణంగా డేట్స్ అడ్జస్ట్ చేయలేక ఈ పాత్రను వదిలేసుకుందని అంటున్నారు. ఇదిలా ఉంటే... పలు కన్నడ, తెలుగు సినిమాలతో ఇప్పటికే దక్షిణాది సినీ అభిమానుల గుండెల్లో చోటు దక్కించుకున్న రుక్మిణి వసంత్ ఎమ్మెస్ సుబ్బులక్ష్మి బయోపిక్‌లో నటిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. 'కాంతార: చాప్టర్ 1'తో రుక్మిణీ వసంత్ సైతం జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం ఆమె యశ్ మూవీ 'టాక్సిక్'లో నటిస్తోంది. అలానే ప్రభాస్ సరసన 'డ్రాగన్' చేస్తోంది. తమిళంలోనూ ధనుష్ మూవీలో రుక్మిణీ వసంత్ ఎంపికైందని వార్తలు వచ్చాయి. కెరీర్ మంచి ఊపు మీద ఉన్న ఈ సమయంలో ఆమె ఎమ్మెస్ సుబ్బులక్ష్మి పాత్రను చేస్తే ఖచ్చితంగా అది ప్రాజెక్ట్‌కు ఉపయోగపడే అంశమే! అయితే రుక్మిణీ వసంత్ ఎమ్మెస్ సుబ్బులక్ష్మిగా నటించబోతోందనే విషయాన్ని ఇంకా అధికారికంగా మేకర్స్ ప్రకటించలేదు.

# ధనుష్‌తో మరోమారు వెంకీ అట్లూరి జత




తమిళ నటుడు ధనుష్‌తో 'సార్' సినిమా తీసి విజయం అందుకున్నారు తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి. అప్పటి నుంచి వీరిద్దరి మధ్య బంధం బలపడింది. ధనుష్ నటించిన ఏ సినిమా తెలుగులో విడుదలైనా వెంకీ అట్లూరి ప్రమోషన్స్‌లో భాగమవుతున్నారు. 'సార్' కాంబినేషన్‌లో మరో సినిమా వస్తుందని చాలాకాలంగా టాక్ నడుస్తోంది. ఈ రూమర్స్ నిజమేనని స్పష్టమైంది. హైదరాబాద్‌లో జరిగిన 'కర' ప్రీరిలీజ్ ఈవెంట్‌కు వెంకీ అట్లూరి గెస్ట్‌గా హాజరయ్యారు. ఈ సందర్భంగా ధనుష్ వెంకీని ఉద్దేశించి మాట్లాడుతూ 'చివరి నిమిషంలో పిలిచినా వచ్చినందుకు థ్యాంక్స్. మీరు నాకు బ్రదర్‌లాంటివారు. 'సార్' లాంటి మంచి చిత్రాన్ని నాకు ఇచ్చారు. 'సార్' తర్వాత మీరో కథ నెరేట్ చేసి.. అదృశ్యమయ్యారు. ఆ కథను సంపూర్ణంగా తీసుకురండి. సినిమా చేయడానికి నేను రెడీగా ఉన్నా. మీ సక్సెస్‌కు చాలా ఆనందిస్తున్నా. మీ గత చిత్రం 'లక్కీ భాస్కర్' చాలా నచ్చింది. మీ రాబోయే సినిమా 'విశ్వనాథ్ అండ్ సన్స్' కు కూడా శుభాకాంక్షలు' అని అన్నారు. ధనుష్ నటించిన 'కర' సినిమా ఈ నెల 30న విడుదల కానుంది.

# చీన్ టపాక్ డుం డుం ..సినిమా టైటిల్
## గవిరెడ్డి శ్రీనివాస్ హీరోగా కొత్త చిత్రం

చీన్ టపాక్ డుం డుం' అనే వినూత్నమైన టైటిల్‌తో ఓ కొత్త తెలుగు సినిమా ప్రారంభమైంది. 'శుభం' సినిమా, 'కుమారి శ్రీమతి' వంటి వెబ్ సిరీస్‌ల ద్వారా గుర్తింపు తెచ్చుకున్న గవిరెడ్డి శ్రీనివాస్ ఈ చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. పూర్తి స్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమా ప్రేక్షకులకు వినోదాన్ని పంచేలా ఉండనుందని చిత్ర బృందం చెబుతోంది. ఈ సినిమా ప్రారంభ కార్యక్రమం ఘనంగా జరిగింది. పలువురు సినీ ప్రముఖులు హాజరై యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ముహూర్తపు షాట్‌కు నటి సమంత క్లాప్ కొట్టగా, దర్శకుడు గోపిచంద్ మలినేని తొలి షాట్‌ను డైరెక్ట్ చేశారు. మల్లిడి వశిష్ట కెమెరా ఆన్ చేయగా, నందిని రెడ్డి, బీవీఎస్ రవి, గౌతమి కలిసి స్క్రిప్ట్‌ను అందించి చిత్రాన్ని ప్రారంభించారు. ఈ చిత్రాన్ని శ్రీను నాగులపల్లి 'విలేజ్ టాకీస్' బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఇది ఆయనకు నిర్మాతగా తొలి సినిమా కావడం విశేషం. సినిమాకు వై.ఎన్ లోహిత్ దర్శకత్వం వహిస్తున్నారు. హీరోయిన్‌గా బ్రిగిడా సాగా నటిస్తుండగా, దువ్వాడ మాధురి ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. టెక్నికల్ టీమ్ విషయానికి వస్తే, ఆర్ట్ డైరెక్టర్‌గా ఏ.ఎస్. ప్రకాష్ పనిచేస్తున్నారు. సినిమాటోగ్రఫీ బాధ్యతలను సెంథిల్ కుమార్ నిర్వహిస్తున్నారు. సంగీతాన్ని పీఆర్ మ్యూజిక్ అందిస్తుండగా, పాటలను తిరుపతి జావానా రాస్తున్నారు. కథ, స్క్రీన్‌ప్లేలను దివ్య తేజస్వి, విక్రమ్ కుమార్ కె, నాగ్ ట్రెల్‌బ్లేజర్, ఏకలవ్య కలిసి సిద్ధం చేశారు. ఇప్పటికే నర్సీపట్నం, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ వేగంగా కొనసాగుతోంది. ఆగస్టు నెలలో సినిమాను విడుదల చేయాలని చిత్ర బృందం లక్ష్యంగా పెట్టుకుంది. వినోదభరితమైన కథ, నవ్వులు పంచే సన్నివేశాలతో 'చీన్ టపాక్ డుం డుం' ప్రేక్షకులను అలరించనుందని యూనిట్ ఆశాభావం వ్యక్తం చేస్తోంది. కాగా, దువ్వాడ మాధురి ప్రయాణం ఎప్పుడూ చర్చనీయాంశంగానే కొనసాగుతోంది. క్లాసికల్ డ్యాన్సర్‌గా, బిజినెస్ ఉమెన్‌గా గుర్తింపు పొందిన ఆమె, వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌తో ఉన్న సంబంధం కారణంగా విస్తృతంగా వార్తల్లో నిలిచారు.